# సింగిల్ పేజీ కథలు

## జ్ఞాని

అది ప్రభుత్వం వారు కట్టించిన పబ్లిక్ పార్కు...చాలా ఏళ్లక్రితం నాటిది కావడం వల్ల పాతబడిన సిమెంటు బెంచీలతో, అరిగి పెచ్చులు ఊడిపోయిన జారుడు బల్లలతో కళావిహీనంగా వుంది.

ఆ పార్కులో..అక్కడక్కడ సిమెంటు బెంచీల మీద వయసు మళ్లి, మళ్లిన వయసులో వచ్చే సమస్యలకు పరిష్కారం తేలక, మనశ్శాంతిని వెతుక్కుంటూ వచ్చే వయోవృద్ధులు..వయసు పండిన స్నేహబంధాలతో ఒకరిని ఒకరు పలకరించుకుంటూ ఆప్యాయతలు, అభిమానాలు పొంగివస్తుంటే, కాసేపు దక్కే మనశ్శాంతితో తృప్తిపడుతూ, గత అనుభవాల పరంపరలతో పావుగంట, అరగంట కంటే ఎక్కువ కూర్చోలేని బలహీనులు..కూర్చుని ఉన్నారు.

అదిగో..అప్పుడే వచ్చాడు అక్కడికో పెద్దమనిషి. చూడ్డానికి చాలా సంస్కారవంతుడిలా ఉన్నాడు. అతనిలో కాస్తంత హుందాతనం...ఎదుటివాళ్లను అయస్కాంతంలాంటి తన చూపులతో ఆకట్టుకునే ముఖవర్చస్సు..అతను రావడంతోనే అందరికీ దూరంగా ఒక చోట బాసిమఠం వేసుకుని కూర్చున్నాడు. అప్రయత్నంగా అందరి చూపులు అతనివైపు మళ్లాయి. అతను ఏదో ధ్యానంలో కూర్చున్నవాడిలా కన్నులు మూసుకుని, నుదిటిమీద చూపుడువేలుతో రుద్దుతూ, చాలాసేపు కదలకుండా కూర్చుని వుండిపోయాడు.

అతడు తిరిగి కనులు తెరిచి చూసేసరికి పార్కుకు వచ్చిన వయోవృద్ధుల్లో కొంతమంది భక్తి, వినయాలతో అతని ముందు కూర్చుని ఉండడం గమనించాడు..అతని ముఖం వికసించింది. అంతవరకు కళ్లు మూసుకుని కూర్చుని ఉన్న అతను, ఎవరికీ తెలియని మహత్తర విషయమేదో తను కనిపెట్టినట్లు అందరివైపు ఒకసారి పరిశీలనగా చూసి, తను వచ్చిన పని ప్రారంభించాడు.

"మీది ఏ మతం?" ఒకతన్ని చూసి అడిగాడు.

"హిందూమతం"

"మీది?" మరొకర్ని

"క్రైస్తవమతం"

"మరి మీది?" ఇంకొకర్ని

"ఇస్లాం మతం"

"మీరు చెప్తారా?" గుంపులో ఇంకొకర్ని

"బౌద్ధమతం"

"మీమీ మతాలనుబట్టి మీమీ దేవుళ్లు, వాళ్ల ఆకారాలు, అవతారాలు, ఆచారాలు, పూజావిధానాలు, కర్మకాండలు ఉంటాయి కదా?"

"అవునండి" అన్నారు అందరూ.

"నాకో సందేహం?"

"చెప్పండి"

"మీమీ మతాల్లానే, మీమీ ప్రాణాలు కూడా హిందూమతం వాళ్ల ప్రాణమని, ముస్లిం మతం వాళ్ల ప్రాణమని, క్రైస్తవమతం వాళ్ల ప్రాణమని, ఇంకా ఇతర మతాల వాళ్ల ప్రాణాలని విడివిడిగా వుంటాయా?"

"మీ సందేహం చాలా హాస్యాస్పదంగా ఉంది" అందరిలో ఒకడు.

"ఎందుకని?"

"మతాలు, దేవుళ్లు వేరయినంత మాత్రాన, ప్రాణాలు ఎలా వేరుగా వుంటాయండి. అందరిలో ఉన్నది ఒకే ప్రాణం కదా?"

"అని ఎలా అనుకోవాలి?"

"అనుకోవడం ఏమిటండీ, అందరిలో ఉన్నది ఒకే ప్రాణమని జగమెరిగిన సత్యమేకదా?"

"మరయితే, అందరిలో ఉన్నదీ ఒకే ప్రాణమని ఒప్పుకుంటున్నారు కదా, ఆ ప్రాణశక్తికి పునాది, ప్రాణదాత, అయిన భగవంతుడు కూడా ఒక్కడేనని ఒప్పుకుంటారా?"

"అబ్బ..నెత్తిబొప్పికట్టేలా ఎంత పెద్ద దెబ్బ కొట్టారండి. మీ ప్రశ్నతో"

"నేను వేసిన ప్రశ్నకు మీకు బొప్పికట్టిందీ అంటే..సమాధానం 'అవును' అని ఒప్పుకుంటే సరిపోతుందేమో?"

"ఇటువంటి క్లిష్టమయిన ప్రశ్నలు ఎదురయినప్పుడు 'గోడమీది పిల్లి' వాటంలా ఉండిపోవటం నా నైజం"

"అవునవును. మీ వంటి గోడమీది పిల్లి వాటంగాళ్లు ఉండబట్టే ఈ ప్రశ్నకు సమాధానం ఉన్నా, లేనట్లే మరుగునపడిపోతోంది. సమాజం మతాల మత్తులో కొట్టుకుపోతోంది."

అంతా నిశ్శబ్దం.

"నిజాన్ని ఒప్పుకోవడానికి ఆత్మబలం కావాలి. ఆత్మబలం కావాలంటే ఆత్మ విమర్శ కావాలి. ఆత్మవిమర్శ కావాలంటే ఆలోచన కావాలి. ఆలోచించే వాడు అహంకారాన్ని వదలగలగాలి. అహంకారాన్ని వదిలితే...ఇంకేముంది? అంతా అర్థమయినట్లే"

తనకు తెలిసిన జ్ఞాన సంపదను తన చుట్టూ కూర్చున్నవారికి ఇంకా పంచిపెడుతూ ఉండగానే పిచ్చాసుపత్రి వేను వేగంగా వచ్చి అతన్ని ఎక్కించుకుని వెళ్లిపోయింది.

-బి.ధనలక్ష్మి (హైదరాబాద్)

○○○




ఖరీదైన ఆ భవంతిలో ఆధునికంగా అలంకరించబడిన ఆ గదిలో కూర్చుని ఎన్నో కథలూ, నవలలూ సృష్టించి గొప్ప రచయిత్రిగా పేరు సంపాదించుకుంది రమాదేవి.

రమాదేవి భర్త రమణారావు ఓ సాఫ్ట్‌వేర్ కన్సల్టెంటు కంపెనీలో ఐదంకెల జీతగాడు. నెలకు పదిరోజులు టూర్ల మీదుంటాడు.

రమాదేవికి ఒక పది నెలల పసిపాప. దాని ఆలనా పాలనా చూసేందుకు ఆయా వుంది. ఆమె పేరు సీత.

సీత ఓ అనాథ. పెళ్ళయిందికాని మొగుడు ఏ కారణం చేతో వదిలేసాడు. ఇద్దరు పసిబిడ్డలు. తండ్రి వున్నా గానీ రోగిష్టి. సంసార భారం సీతమీదే పడటంచేత ఆ లేత వయసులోనే రమాదేవి బిడ్డకు ఆయాగా కుదిరింది.

సీత అణకువగల పిల్ల. పనిమంతురాలు. అన్ని సుగుణాలున్నవాళ్ళకే దేవుడు అదనంగా కష్టాలు రాసిపెడతాడు కాబోలు అనిపిస్తుంది రమాదేవికి. సీత జీవితం మీద ఓ కథ కూడా రాసి పోటీలో బహుమతి సంపాదించింది ఆమె.

'అలాంటి సీత..ఇలాంటి పని చేస్తుందా?' ఆరోజు మధ్యాహ్నం తన గది కిటికీగుండా చూసిన దృశ్యాల్ని నమ్మలేకుండా వుంది

# కళ్ళు చేసే మోసం

రమాదేవి.

ఎదురు డాబామీద ఆ ఇంటి ఓనరు లాయరుగారి పడగ్గదిలో...అతని బెడ్‌మీద అటు తిరిగి పడుకుని వున్న సీతను చూసి షాకయిందామె. పాప ఉయ్యాలలో ఆకలికి ఏడుస్తుంటే అటువెళ్ళిపోయింది. కానీ..ఆ దృశ్యం వెంటాడుతూనే వుంది. 'ఇందుకా ఈ మహాతల్లి రెండు రోజుల్నించి పనుందని పర్మిషనడిగి వెళ్ళి వస్తుంది. మంచి పిల్ల అనుకుని పనిలో పెట్టుకున్నాను. అయినా ఆ లాయరుకు బుద్ధుండక్కర్లేదూ! పెళ్ళాంపోయి వారం కూడా కాలేదు. ఇంట్లో భార్య వదిలిపోయిన పసిగుడ్డు కూడా వుంది. సిగ్గులేకుండా ఇలా పనిపిల్లతో!

ఛ! తలుచుకుంటూనే డోకొచ్చేటట్లుగా వుంది. ఇలాంటి నీచురాలి చేతిలోనా తన పాప పెరగాల్సింది. ఎంతమాత్రం వీల్లేదు. దీన్ని వెంటనే పనిలోనుంచీ పంపెయ్యాల్సిందే' అనుకుంది రమాదేవి ఆ క్షణంలో..కానీ..అరగంట తరువాత ఇంటికొచ్చిన సీత మొహం చూసి ఎలా అడగాలో తెలీలేదు. 'కథల్లో అయితే పాత్రల చేత ఏమయినా చేయించొచ్చు. ఏమైనా అడిగించెయ్యొచ్చుకానీ..నిజ జీవితంలో ఇలాంటి సిట్యుయేషన్‌ని ఎలా ఎదుర్కోవాలో ఆమెకు బొత్తిగా అనుభవం లేదు. భర్త వచ్చిన తరువాత ఆయనతో చర్చించి ఏ పనయినా చేయాలి' అని అప్పటికి వాయిదా వేసుకొందామె.

ఆ రాత్రి రమాదేవి చెప్పినదంతా విన్న ఆమె భర్త రమణారావు "సీతను చూస్తే అలా అనిపించదే...ఒక్కోసారి మన కళ్ళే మనల్ని మోసం చేస్తుంటాయి రమా! తొందరపడితే ఒక అమాయకురాలిని అన్యాయంగా శిక్షించినట్లవుతుంది. గట్టిగా నిర్ధారణ అయిన తరువాతే ఆమెను పంపించటం మంచిది" అన్నాడు. నిదానంగా ఆలోచిస్తే భర్త చెప్పింది కూడా నిజమేననిపించింది రమాదేవికి.

మర్నాడు అదే వేళకి సీత పనుందని బైటకు వెళ్ళింది. తన వంట్లో హుషారుగా లేకపోయినా అసలు విషయం బైటపడుతుందనే వుద్దేశ్యంతో పర్మిషనిచ్చింది రమాదేవి.

సీత వెళ్ళింది సరాసరి లాయరుగారి గదిలో దూరటానికే. ఆమె బెడ్‌రూం తలుపులు వేయటం కళ్ళారా చూసిందీసారి. 'ఇంక అనుమానమెందుకు? ఇలాంటి బేడ్ లేడీ తనింట్లో వుండటానికి ఎంత మాత్రం వీలులేదు' అని ఆ క్షణంలోనే ఒక నిర్ణయానికొచ్చింది రమాదేవి. అరగంటయిన తరువాత జాకెట్టు గుండీలు పెట్టుకుంటూ బెరుగ్గా మేడమెట్లు దిగి ఇంట్లోకొస్తున్న సీతను చూసి ఏదో అనబోయింది. నోరు పెగలలేదు. కళ్ళు తిరిగి నేలమీద కొరిగిపోయింది.

"సీత ఇలాంటి పని చేస్తుందంటే నేను నమ్మలేకపోతున్నాను రమా!" అన్నాడు రమణారావు ఆ రాత్రి ఇంటికొచ్చిన తరువాత భార్య చెప్పినదంతా విని.

రమాదేవికి ఒళ్ళుమండింది. "అంటే..నేను కళ్ళారా చూసిందంతా అబద్ధమంటారా? లేకపోతే నేనేమన్నా కల్పించి చెబుతున్నానని అనుమానమా? మగబుద్ధి పోనిచ్చుకున్నారు కాదు..ఆ నీతిలేనిదాన్ని ఇంట్లో వుంచుకుంటే ఏనాటికైనా ఓ ఛాన్సు వస్తుందని ఆశా?"

"రమా!" అని పెద్దగా అరిచాడు రమణారావు.

"మతుండే మాట్లాడుతున్నావా?..ఇదే కూత ఇంకెవరైనా కూసి వుంటే ముప్పై రెండు పళ్ళూ వూడగొట్టి చేతిలో పెట్టుండేవాడిని" అంటూ విసురుగా వెళ్ళిపోయాడు.

రమాదేవి ఉక్రోషం కాస్తా ఏడుపులోకి దిగిపోయింది. ఆమె అదే పనిగా ఏడుస్తుంటే ఓదార్చటం సీత వంతయింది. తిండి తినకుండా పడుండిపోయిందా రాత్రంతా రమాదేవి.

మళ్ళీ కళ్ళు తెరిచేసరికి ఎదురుగా భర్త..పక్కన డాక్టర్ కృష్ణానందం. "పాపకు బ్రెస్ట్ ఫీడింగ్ వద్దు. ఆల్టర్నేట్ అరేంజ్‌మెంట్ చేయండి" అని రమణారావుకి చెప్పి వెళ్ళిపోయాడాయన.

అయోమయంగా చూస్తున్న రమాదేవితో అన్నాడు రమణారావు. "నీకు జాండిస్‌ట. ఎడ్వాన్స్ స్టేజ్‌లో వుందంటున్నాడు. నౌ యూ నీడ్ కంప్లీట్ రెస్ట్..అర్ధమయిందా?"

"మరి పాపకు బ్రెస్ట్‌ఫీడింగ్..అదీ వద్దంటున్నాడు. ఎలాగండీ" ఏడ్చే పాపవంక నిస్సహాయంగా చూస్తూ అడిగింది రమాదేవి.

"పసిగుడ్డుకు ఒక్కసారిగా పాలు మారిస్తే పడతాయో లేదో.." గుక్కపెట్టి ఏడ్చే పాపవంక బిక్కమొహం వేసి చూస్తూ అన్నాడు రమణారావు.

ఎప్పుడొచ్చిందో సీత కక్కటిల్లిపోయే పసిగుడ్డును తన చేతుల్లోకి తీసుకుంటూ "అయ్యగారూ! మీరు కాస్త అసుంటా బైటికి ఎల్లిరండి సారూ!" అంది. ఆమె గొంతులో ఏ మంత్రం వుందో అంతలావు ఇంజనీరుగారూ నిశ్శబ్దంగా బైటికి వచ్చేసారు.

గబగబా బిడ్డను ఒళ్లోకి తీసుకుని పైట చాటుచేసుకుంది సీత. పాప పాలు తాగే పనిలో పడిపోయింది.

నివ్వెరపోయింది రమాదేవి. "అయ్యయ్యో! ఇదేం పనే..నీ బిడ్డకు పాలుండొద్దూ!"

"ఫరవాలేదండమ్మగారూ! ఇది మాకు అలవాటే...మావాడు మరీ ఇంత పసిగుడ్డు కాదులేండి. వాడికి ఈ అలవాటు తప్పించాలనుకుంటున్నానమ్మా. ఎదురింటి లాయరుగారి ఆడాళ్లు పోయారుగదండీ...పాపం. ఆ కూన ఒహటే కక్కటిల్లి పోతావుంటే, డబ్బాపాలకు మారటం డేంజరన్నార్టండీ.. కూలివ్వండి నేనే ఆ పని సేత్తానని ఎళ్ళానమ్మగారూ! మీకు చెబితే ఏమంటారోనని చెప్పలేదు తల్లీ. మీ పాపకూ ఊరికేగాదు లెండి. ఏదో మీకు తోచింది ఇవ్వండి. మా అయ్య మందులకన్నా వస్తాయి. ఇట్టాంటివే ఏవో ఒకటి చెయ్యకపోతే సంసారం లాగటం నావల్లేమవుతుంది తల్లీ!" అంటోంది సీత పాప తలనిమురుతూ.

పాలు తాగిన పాప ప్రశాంతంగా నిద్రకుపడింది. గుమ్మంలో నిలబడి వింటున్నాడు రమణారావు. రమాదేవి మొగుడి వంకే కాదు..సీత వంక కూడా సూటిగా చూడలేకపోయిందీసారి. "ఒక్కోసారి మన కళ్ళే మనల్ని మోసం చేస్తుంటాయి" అని భర్త అన్న మాటలు చెవిలో గింగురుమంటున్నాయి.

-కర్లపాలెం హనుమంతరావు

(హైదరాబాద్)

